## లంచగాండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలియజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,

# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక

## రైతులకు అధికారులు సహకరించాలి

బోథ్, : పంటలను విక్రయించేందుకు మార్కెట్ కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపడుతూ వారికి న్యాయం జరి గేలా చూడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ బోథ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా తూకం కాంటాలకు ప్రత్యేక పూజలు చేసి, మార్కెట్ కు పంటను తీసుకొచ్చిన తొలి రైతును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... ఎండలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని వీలైనంత త్వరగా పంటలను కొనుగోలు చేయాలని సూచించారు. తేమ శాతం సాకుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నల్లగొండ సంపుటి:16 సంచిక:94 ఎడిటర్: సయ్యద్ పాష 22-04-2026 బుధవారము పేజీలు :8 వెల:1/-

# సమస్యలకు సత్వర పరిష్కారం కల్పిస్తాం



కుర్సెయోంగ్: పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేయనుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా (టూఎక్ రాష్ట్రుష్ట్ర) అన్నారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీకి ఉద్వాసన చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. కుర్సెయోంగ్‌లో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, డార్జిలింగ్‌లో గూర్ఖా కమ్యూనిటీ చిరకాల సమస్యలకు సత్వర పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన 6 నెలల్లోనే గూర్ఖాల సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందిస్తాం. గత టీఎంసీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు గూర్ఖాల ఆందోళనలను పట్టించుకోవడంలో విఫలమయ్యాయి' అని అమిత్‌షా అన్నారు. గూర్ఖాల చరిత్రను అణిచివేసేందుకు మమతా దీదీ ప్రయత్నించారని, గూర్ఖాలకు జరుగుతున్న అన్యాయాలకు ముగింపు పలికే సమయం వచ్చిందని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, టీఎంసీ మన కొండప్రాంతాలను రక్తంతో పెయింట్ వేశారని, గూర్ఖాలకు జరిగిన అన్యాయాలకు నరేంద్ర మోదీ నాయకత్వంలో తెరపడుతుందని చెప్పారు. 'గూర్ఖా సోదరులపై వందలాది తప్పుడు కేసులు పెట్టారు. వాటన్నింటినీ జూలై 31వ తేదీలోగా ఉపసంహరిస్తాం. గూర్ఖా ఉద్యమాన్ని వాళ్లు అణిచివేశారు. మేము ఆ కేసులన్నీ ఉపసంహరిస్తాం. ఇక నిరసనలకు తావులేని విధంగా సమస్యలను పరిష్కారిస్తాం' అని అమిత్‌షా భరోసా ఇచ్చారు. జైళ్లకు పంపిస్తాం..సందేశ్‌ఖాలీ వంటి ఘటనలను అమిత్‌షా ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మహిళలపై నేరాలు పెరిగాయని, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నేరాలకు బాధ్యులైన వారందిరినీ జైళ్లకు పంపిస్తామని అమిత్‌షా చెప్పారు. కుర్సెయోంగ్, కుల్తి, సల్బోని, ఛాందిపూరూర్ తదితర కీలక ప్రాంతాల్లో అమిత్‌షా మంగళవారంనాడు సుడిగాలి ప్రచారం సాగించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరుగనుండగా, మే4న ఫలితాలు వెలువడతాయి.

# ఇరాన్‌తో చర్చలకు రమ్మంటే వస్తా



అమెరికా, పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ నాయకత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనప్రాయంగా పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ట్రంప్.. ఇరాన్‌తో శాంతి చర్చల గురించి మాట్లాడారు. 'వారు కలవాలనుకుంటే.. మా దగ్గర చాలా మంది సమర్థులైన వ్యక్తులు ఉన్నారు. ఒకవేళ వారు నేరుగా నన్నే కలవాలనుకున్నా నాకు అభ్యంతరం లేదు. ఇరాన్ నేతలను కలిసి శాంతి చర్చల గురించి మాట్లాడేందుకు నేను సిద్ధమే' అని ట్రంప్ ప్రకటించారు. నేరుగా కాకపోయినా వర్చువల్‌గా అయినా ట్రంప్ పాల్గొనే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాగా, ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే అవకాశం ఉందని అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రయాస్ అభిప్రాయపడ్డారు. కాగా, పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య రెండో దఫా శాంతి చర్చలు జరుగుతాయా, లేదా అనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. . అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో.. వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ అన్నారు. తమ నౌకల రవాణాపై దిగ్బంధనం విధించిన ట్రంప్ ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను దెబ్బ తీశారని అభిప్రాయపడ్డారు.

# ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే..

## ప్రజా ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క



ములుగు : ప్రజల సమస్యలను గ్రామాలలోనే క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, నేరుగా ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు, మంగపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మండలానికి విచ్చేసిన మంత్రి సీతక్క మొదట మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మల్లూరు, మంగపేట గ్రామాలలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ప్రజల సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటూ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.... గ్రామాలలోని సమస్యలను నేరుగా పరిష్కరించడానికి గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలలో ఉండే గ్రామస్తులు కార్యాలయాలకు రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని దృష్టిలో ఉంచుకొని స్వయంగా ఆ గ్రామాలలోనే ప్రజా దర్బార్ నిర్వహించి, సమస్యలపై గ్రామ అభివృద్ధిపై కూలంకషంగా చర్చించుకోవడానికి అణువుగా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలను ప్రజలతో మమేకమై ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించడం వలన ప్రజలు సమస్యల నుంచి ఉపశమనం కలగడమే కాక అనేక ప్రయోజనాలు చేకూరుతూ మెరుగైన అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, తహశీల్దార్ తోట రవీందర్, ఎంపీడీఓ బి.బద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రమాదకరమైన ఆట ఆడుతోంది



తమిళనాడు : మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్ )తో ముడిపెట్టడం ద్వారా బీజేపీ ఒక ప్రమాదకరమైన ఆట ఆడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడాన్ని ఆయన స్వాగతించారు. మంగళవారం తమిళనాడులోని వేళచ్చేరిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ, రాజ్యాంగ సవరణ బిల్లు-2026పై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించడానికి కేంద్రం నిరాకరించిందని ఆయన ఆరోపించారు. "2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజక వర్గాల పునర్విభజనతో, మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టి మోదీ సర్కార్ ప్రమాదకరమైన ఆట ఆడింది. జనాభాను విజయవంతంగా నియంత్రించిన తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించడమే లక్షంగా ఈ చేసింది. అందుకే ప్రతిపక్షాలు అన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. దిల్లీలో కాంగ్రెస్ ముందుండి నడిపించగా, డీఎంకే, టీఎంసీ, ఎస్ పీ వంటి పార్టీలు భుజం భుజం కలిపి ఈ బిల్లును ఓడించాయి. 'ఈ బిల్లుకు వ్యతిరేకంగా మొదట గళమెత్తింది తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. ఎందుకంటే ఇది ప్రజలకు, దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకమైనది అంటూ ఆయన బిల్లు ప్రతులను చింపి తగలబెట్టారు. చివరకి లోక్ సభలో ఆ బిల్లు వీగిపోయింది. ఇది దేశంలోని ప్రతి పౌరుడి విజయం. సమాఖ్య స్ఫూర్తికి, న్యాయానికి దక్కిన విజయం. పంచాయతీలు, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్. కనుక అది కాంగ్రెస్ విజయమే తప్ప ప్రధాని మోదీది కాదు' అని మల్లికార్జున ఖర్గే అన్నారు. నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియను దేశాన్ని వంచించడంగా ఖర్గే అభివర్ణించారు. "2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును మనం ఏకగ్రీవంగా ఆమోదించాం. మరి ప్రధాని మోదీ దానిని ఎందుకు అమలు చేయలేదు 30 నెలలపాటు దానిని ఆయన కోల్డ్ స్టోరేజీలో పెట్టారు. వాస్తవానికి మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని నేను ప్రధాని మోదీకి, రిజిజుకు 3సార్లు లేఖలు రాశాను. చివరకు దీనిపై చర్చలకు అఖిలపక్ష సమావేశం కోరితే, దానికి బదులుగా విడివిడిగా పిలిచారు. ఇది దేశాన్ని మోసం చేయడమే" అని ఖర్గే విమర్శించారు. మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. దీనితో అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించక బిల్లు వీగిపోయింది. ఈ నేపథ్యంలో సదరు బిల్లుకు అనుబంధంగా ఉన్న డీలిమిటేషన్ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లుతో ముందుకు వెళ్లకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి లోక్ సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడంతోపాటు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యాంగా ఎన్ డీఏ సర్కార్ ఈ బిల్లును ప్రతిపాదించింది. అయితే దీని అమలును 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిగిన పునర్విభజనతో ముడిపెట్టారు. మరోవైపు ఖర్గే ఏఐఏడీఎంకేపై కూడా విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ బీజేపీకి సైలెంట్ భాగస్వామిగా మారిందన్నారు. "మీకు బీజేపీ ముందు తలవంచని నాయకుడు కావాలి. మీకు అండగా నిలబడి పోరాడే ఎంకే స్టాలిన్ వంటి వారు కావాలి. కానీ ఈ రోజు ఏఐఏడీఎంకే తన అస్తిత్వాన్ని కోల్పోయి, మోదీకి బానిసగా మారింది. కనుక తమిళనాడు ప్రయోజనాలను ఆ పార్టీ కాపాడలేదు" అని ఖర్గే విమర్శించారు. తమిళనాడుకు అందాల్సిన నిధులు, పన్నుల వాటాను కూడా మోదీ సర్కార్ నిలిపివేస్తోందని ఖర్గే ఆరోపించారు. వేళచ్చేరి కాంగ్రెస్ అభ్యర్థి జెఎంహెచ్ ఆసన్ మౌలానా తరఫున ప్రచారం చేస్తూ, ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు. మరోవైపు శాసనసభల్లో మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాని మోదీకి లేఖలు రాశారని కాంగ్రెస్ గుర్తుచేసింది. అయితే మోదీ సర్కార్ మాత్రం ఈ డిమాండ్ పై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని, ఇప్పుడు దానిని నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టి ఆలస్యం చేస్తోందని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యునికేషన్స్ ) జైరాం రమేశ్ ట్విట్టర్ వేదికగా ఈ విషయాలను వెల్లడించారు. అప్పట్లో సోనియా గాంధీ, ప్రధాని మోదీకి రాసిన లేఖను కూడా ఆయన పోస్టు చేశారు.

# ఆర్థిక సంక్షోభం సృష్టించిందే మీరు..



హైద్రాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరు కుపోయిందని, నేడు సంక్షేమ పథకాలు ఆగిపో వడానికి గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని ఆయన విమర్శించారు. ఈ మేరకు మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, గులాబీ నేతల వైఖరిపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ, "రైతులకు మేలు చేశామని చెప్పుకోవడం ఈ శతాబ్దపు అతి పెద్ద జోక్" అని పొన్నం ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో రైతులను గోస పెట్టి, ఇప్పుడు సభలు పెట్టి రైతు భరోసా ఇచ్చామని చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. రాష్ట్రం నేడు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మంత్రి స్పష్టం చేశారు. వారు సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్లే కొన్ని సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని, ఖజానాను ఖాళీ చేసి ఇప్పుడు నీ తులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ పునరుద్ఘాటించారు. "ఒక్కొక్కటిగా అన్ని హామీలను అమలు చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇప్పటికే అమలవుతున్నాయి. మిగిలిన పథకాలను కూడా క్రమ పద్ధతిలో ప్రజలకు అందిస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తున్న విపక్షాల కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# జూన్ నుంచి నిషేధం అమలు: తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం



హైద్రాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు సంబంధించి కీలక నిర్ణయం వెలువడింది. అధికారిక మార్గదర్శకాల ప్రకారం, ఈ ఏడాది బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వ రకు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ గడువు ముగిసిన అనంతరం, అంటే జూన్ 1 నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. దీంతో మే నెలలోనే ఉద్యోగులు తమ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. మార్గదర్శకాల ప్రకారం, ఒకే స్థలంలో నాలుగేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు బదిలీ తప్పనిసరిగా ఉండనుంది. ఇదే సమయంలో, కనీసం మూడేళ్లు సేవ చేసిన ఉద్యోగులు బదిలీకి అర్హులుగా పరిగణించబడతారు. ఈ చర్యల ద్వారా పరిపాలనలో పారదర్శకత, సమర్థత పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు మార్పిడి చేయడం ద్వారా సేవల నాణ్య తను మెరుగుపరచాలని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ మార్గదర్శకాలపై అధికా రిక ఉత్తర్వులు (జీవో) వెలువడాల్సి ఉందని, తుది వివ రాలు ప్రభుత్వం ప్రకటించాల్సి ఉం దని తెలుస్తోంది. పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే అమలు విధానంపై స్పష్టమైన దిశానిర్దేశం లభించే అవకాశం ఉంది. మే నెల ఉద్యోగుల బదిలీలకు కీలకంగా మారనుండగా, జూన్ నుంచి అమల్లోకి వచ్చే నిషేధం కారణంగా ముందస్తు ప్రణాళిక అవసరం ఏర్పడింది. ఈ నిర్ణయం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

# కాంగ్రెస్‌కు ప్రజలే బలం: మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి,: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ నేతలకు మంత్రి దామో దర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారె డ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి మంత్రి దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. నేతలు పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు. అలాగే పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పద విని అనుభవించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో నియో జకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలమని.. కార్యకర్తలే ధైర్యం, స్థైర్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, విశ్వాసం తక్కువని... అవకాశవాదం ఎక్కువన్నారు. ఎప్పుడూ శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. 70 వేల ఉద్యోగాలను ప్రభుత్వం ఇప్పటికే భర్తీ చేసిందని వెల్లడించారు. ఆరోగ్య శాఖలో ఇంకో 3 నెలల్లో మొత్తం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం పథకం దేశంలో ఎక్కడా లేదని దామోదర రాజనర్సింహ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని అన్నారు. 200 కోట్ల రూపా యల అభివృద్ధి పనులతో సింగూరు ప్రాజెక్ట్‌ను టూరిజం స్పాట్‌గా మారుస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

# దేశ టైమ్స్ సంపాదకీయం

## విదేశాల్లో ఆర్థిక మాంద్యం, ఉపాధి కోల్పోవడం వల్ల కార్మికులు డబ్బు పంపలేని పరిస్థితి ఏర్పడింది...

పశ్చిమాసియా లోని బహ్రెయిన్, కువాయిట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాల్లోని భారతీయ వలస కార్మికులు ఇరాన్ అమెరికా యుద్ధ బీభత్సం వల్ల ఉపాధి కోల్పోయి దిక్కుతోచక స్వదేశానికి తిరిగి తరలి వస్తున్నారు. గత మార్చి నుంచి తాము పనిచేస్తున్న పరిశ్రమలు మూతపడుతున్నాయి. యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 3,75,000 మంది వలస కార్మికులు తిరిగి స్వదేశానికి తరలి వచ్చేశారు. గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) దేశాల భారతీయ వలస కార్మికుల నుంచి ఏటా భారత్‌కు 45 బిలియన్ డాలర్లు వరకు చెల్లింపులు జరిగేవి. అంటే భారత్ లోని అంతర్గత చెల్లింపుల వెల్లువలో దాదాపు సగం.ఈ నిధులు భారత వాణిజ్యంలో గణనీయంగా లోటును తీర్చేవిగా ఉంటున్నాయి. అయితే యుద్ధం నుంచి ఈ పరిస్థితి మారిపోయింది. వలస కార్మికుల నుంచి స్వదేశానికి నిధులు రావడం ఆగిపోయింది. విదేశాల్లో ఆర్థిక మాంద్యం, ఉపాధి కోల్పోవడం వల్ల కార్మికులు డబ్బు పంపలేని పరిస్థితి ఏర్పడింది. దీనిని ఒక విధంగా 'విదేశీ మారక ద్రవ్య సంపీడనం' అని వ్యవహరిస్తున్నారు. డబ్బు రాకపోవడంతో స్వదేశం భారత్‌లో ఉన్నవారు ఉపాధి కోసం వెదుక్కుంటున్నారు.ప్రస్తుతం తమ వద్ద ఉన్న డబ్బుతో చాలీచాలని అవసరాలతో కొందరు సర్దుకుపోతున్నారు. ఇది కుటుంబాల జీవన ప్రమాణాలను, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని, స్థానిక మార్కెట్లను కుదిపేసే నిజమైన ఆర్థిక సంక్షోభం. ఇది కేవలం ప్రభుత్వ సంక్షేమ గణాంకాలతో పరిష్కారమయ్యేది కాదు. కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, గ్రామీణ జీవన ఆర్థిక పరిస్థితికి పెద్ద దెబ్బ. ఇంటి ఖర్చులకు, ఆస్తుల పెట్టుబడికి, పిల్లల చదువుకు తగిన ఆర్థికస్తోమతు లేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదిలా ఉండగా అసంఘటిత కార్మికులు తీవ్ర పేదరికం లోకి నెట్టబడుతున్నారు. ఎల్‌పిజి వినియోగంలో 60% భారత్ దిగుమతి పైనే ఆధారపడుతోంది. ఈ మొత్తంలో 90% హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. మార్చి మొదటి వారంలో ఈ రవాణా మార్గం తీవ్ర ఒత్తిళ్లకు గురి కావడంతో సరకుల రవాణాకు, సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అసంఘటిత కార్మికులు 40కోట్ల మంది కార్మికులు పేదరికం లోకి నెట్టబడ్డారు. కేంద్ర ప్రభుత్వం వలస కార్మికుల కోసం ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు దాదాపు 30,000 వరకు పంపిణీ చేస్తున్నా నమోదిత గృహ కనెక్షన్ల ద్వారానే ఈ పంపిణీ సాగుతుండడంతో వివిధ పరిశ్రమల్లో పనిచేసే వలస కార్మికులకు ఇవి చేరడం లేదు.దేశ తయారీ రంగానికి సంబంధించి వస్త్ర పరిశ్రమలు, నిర్మాణ రంగంలో కోట్లాది మంది వలస కార్మికులు పని చేస్తున్నారు. వస్త్ర పరిశ్రమలో సింథటిక్ ఫైబర్స్, డైన్, కోటింగ్‌లను వినియోగిస్తుంటారు. వీటికి పెట్రో కెమికల్స్ ముడి సరకులు. దీనికి తోడు నాఫ్తా, ఎల్‌పిజి, నిల్వల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఉత్పత్తుల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. వస్త్రాల తయారీ యూనిట్లు ఏవైనా అధికారికంగా మూసివేసే ముందు కార్మికులు పనిచేసే షిఫ్టులను తగ్గిస్తుంటారు. ఉత్పత్తులు తగ్గడమే కాక, వేతనాలు సరిగ్గా చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా ఫ్యాక్టరీలు మూతపడటానికి దోహదం చేస్తుంది. వ్యవసాయం తరువాత వలస కార్మికులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే రంగం నిర్మాణ రంగమే. పెట్రోల్ ఆధారిత మెటీరియల్ ధరలు పెరగడంతో ఇంధనానికి సంబంధించిన ఇతర సమస్యలు తలెత్తి నిర్మాణానికి కావలసినవేవీ అరుదైపోతున్నాయి.దాంతో నిర్మాణాలపై డెవలపర్లు పెట్టుబడులను తగ్గిస్తున్నారు. ఉదాహరణకు గుజరాత్‌లో నిర్మాణరంగం లోని కార్మికులు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. పోర్టు పనుల్లో పనిచేసే వారు, రవాణా రంగంలో పనిచేసేవారు దాదాపు లక్ష మంది కార్మికులు పని దొరకుతుందో లేదో అన్న సందేహంతో హోళీ పండగ తరువాత పనుల్లోకి రావడం లేదు. వ్యవసాయ రంగానికి సంబంధించి యూరియా ఉత్పత్తికి సహజవాయువు (నేచరల్ గ్యాస్) ఎంతో అవసరం. గ్యాస్ ధరలు పెరగడంతో వ్యవసాయ ఉత్పత్తుల ధరలతో సంబంధం లేకుండా యూరియా ఉత్పత్తుల ధరలు, ఆహార రిటైల్ మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. వలస కార్మికుడు ఒక పక్క ఎక్కువ ధరతో ఎల్‌పిజిని కొనుక్కోవలసి రావడం, మరో వైపు ఎక్కువ ధరలకు ఆహారాన్ని కొనుగోలు చేయడం తప్పడం లేదు. ఈ ఆర్థిక పరిణామాలు అర్బన్ లోను, గ్రామీణ ప్రాంతాల్లోనూ తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి.అర్బన్ ఏరియాల్లోని పరిశ్రమలు కార్మికుల కొరతతో అల్లాడుతుండగా, తిరిగి స్వగ్రామాలకు తరలివస్తున్న వలస కార్మికులకు గ్రామాల్లో ఉపాధి దొరకడం లేదు. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దౌత్యమార్గాల ద్వారా హర్మూజ్ జలసంధి ద్వారా చిక్కుకుపోయిన ఎనిమిది ఎల్‌పిజి ట్యాంకర్లను దేశానికి రప్పించగలగడం కొంతవరకు మేలు బాట అవుతుంది. స్వదేశీ ఎల్‌పిజి ఉత్పత్తి దాదాపు 40% పెరిగింది. రిఫైనరీలు తమ సామర్థ్యాన్ని మించి ఆపరేషన్ చేస్తున్నాయి. వీటన్నిటివల్ల దేశంలో తయారీ, నిర్మాణ రంగాల్లో సరఫరాకు ఆటంకాలు కొంతవరకు నివారించగలిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇక మూడవ శ్రేణి ఆర్థిక పరిణామాలకు అంటే పరిశ్రమలు మూతపడడం, పెట్టుబడులు వేరే దేశానికి తరలిపోవడం, నైపుణ్యాలు తగ్గిపోవడం వంటి వ్యవస్థాగత మార్పుల్లో తగిన స్పందనలు రావలసి ఉందని భావిస్తున్నారు. వలస కార్మికులు తమ ఇళ్లకు తరలిపోయే పరిస్థితి రాకుండా పాలనా పరమైన విధానాలతో ఆయా పరిశ్రమలను పర్యవేక్షించడం తప్పనిసరి. వేతనాలకు గ్యారంటీ కల్పించడంతోపాటు పునరావాసం కల్పించడం వంటి చర్యలు తక్షణం చేపట్టవలసి ఉంది.

## ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా వర్ని మండలం చింతల్‌పేట్ గ్రామంలో భూవివాదం తీవ్ర ఉద్రిక్తత, ఘర్షణకు దారి తీసి రక్తపాతం చోటుచేసుకుంది. వర్ని మండలం చింతల్ పేట్ గ్రామానికి చెందిన ప్రేమ్ సింగ్ కుటుంబ సభ్యులపై, అదే గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి హరిదాస్ కుటుంబ సభ్యులు దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనలో ప్రేమ్ సింగ్‌కు తలపై గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భూమి కొనుగోలు, అమ్మకాలలో డబ్బుల వ్యవహారం కారణంగా ఈ ఘర్షణ చోటుచేసుకున్నట్లు బాధితులు తెలిపారు. తమపై విచక్షణారహితంగా కర్రలు, కారం, ఇతర సామాగ్రి తో దాడి చేశారని, గత కొంతకాలంగా హరిదాస్ కుటుంబం నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై వర్ని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా, మాజీ జెడ్పిటిసి హరిదాస్ బాధిత కుటుంబాల ఆరోపణలను ఖండిస్తూ, తాము ఎవరిపై దాడి చేయలేదని, ప్రేమ్ సింగ్ కుటుంబ సభ్యులే తమపై దాడి చేశారని పేర్కొన్నారు. తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ విషయంలో సహకరించడం లేదని, డబ్బులు చెల్లించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ స్పందిస్తూ భూమి అమ్మకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ విషయంలో సమస్యలు ఉన్నట్లు, డబ్బులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వివాదం చెలరేగిందని తెలిపారు. వర్ని ఎస్సై మాట్లాడుతూ ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు..

వరంగల్: ఆసుపత్రుల చుట్టూ తిరగడం, వేలాది రూపాయలతో మందులు వేసుకోవడం కంటే మన జీవనశైలిలోనే ఈ '10 మంది డాక్టర్లను' భాగం చేసుకుంటే అసలు రోగాల బారిన పడే అవకాశమే ఉండదు. ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు ఇవే.. ఆధునిక కాలంలో మానవుడు సాంకేతికతతో పాటు వేగాన్ని అలవర్చుకున్నాడు కానీ, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. అయితే, మనకు తెలియకుండానే మన చుట్టూ పది మంది గొప్ప వైద్యులు ఉన్నారు. వీరికి ఫీజు కట్టక్కర్లేదు, అపాయింట్‌మెంట్ తీసుకోవక్కర్లేదు. కేవలం వీరిని మన దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే చాలు. ఆ పది మంది వైద్యులు మన ఆరోగ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతారు. సూర్యుడు భూమిపై ఉన్న సమస్త జీవరాశికి మూలాధారం. ఉదయాన్నే ఎండలో కాసేపు ఉండడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్-డీ లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా ఉంచడమే కాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గించి 'సెరోటోనిన్' అనే హ్యాపీ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. శరీరం తనను తాను రిపేర్ చేసుకునే సమయం నిద్ర. రోజుకు 7 నుండి 8 గంటల గాఢ నిద్ర లేకపోతే మెదడు పనితీరు మందగిస్తుంది. నిద్ర అనేది కేవలం విశ్రాంతి కాదు, అది శరీరానికి ఇచ్చే ఒక 'రీఛార్జ్' వంటిది. ఇది కేవలం శారీరక కలయిక మాత్రమే కాదు. భాగస్వామితో గడిపే నాణ్యమైన సమయం వల్ల శరీరంలో 'ఆక్సిటోసిన్' విడుదలవుతుంది. ఇది రక్తపోటును తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది, మానసిక బంధాన్ని బలోపేతం చేస్తుంది. శరీరాన్ని కదిలించడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రోజుకు కనీసం 30 నిమిషాల నడక లేదా వ్యాయామం వల్ల గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. కండరాలు, కీళ్లు చురుగ్గా ఉంటాయి. ఆహారం మితంగా తీసుకుంటే ఔషధం.. మితం తప్పితే విషం అంటారు పెద్దలు. ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్స్ కాకుండా.. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి నీరు అత్యవసరం. రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా ఉంటుంది, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల ఊపిరితిత్తులు శుభ్రపడతాయి. ఉదయాన్నే పార్కుల్లో లేదా చెట్ల మధ్య గడపడం వల్ల మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరిగి ఏకాగ్రత పెరుగుతుంది. 'నవ్వు నాలుగు విధాలా చేటు' కాదు, 'నవ్వు పది రకాల రోగాలకు మందు'. మనసారా నవ్వడం వల్ల ఊపిరితిత్తులకు వ్యాయామం లభిస్తుంది. ఒత్తిడిని కలిగించే 'కార్టిసోల్' హార్మోన్ తగ్గుతుంది. మనిషి సంఘజీవి. మంచి స్నేహితులతో మనసు విప్పి మాట్లాడడం వల్ల కలిగే మానసిక ప్రశాంతత ఏ థెరపీ ఇవ్వలేదు. ఒంటరితనాన్ని పారద్రోలి, ఆయుష్షును పెంచడంలో స్నేహం కీలక పాత్ర పోషిస్తుంది. చివరిగా, ఉన్నదానితో తృప్తి చెందడం, అందరికీ కృతజ్ఞతతో ఉండటం. ఈ లక్షణం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. సానుకూల దృక్పథం వల్ల శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని సైన్స్ చెబుతోంది.

## తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు..

### రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ పెంపునకు సర్కార్ రెడీ..!



హైద్రాబాద్: తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్ విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వ లెక్కల్లో రూ. 20 లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచనున్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ. 2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగినప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదించారు. ఎస్ఎఫ్‌టీకి రూ. 7 వేలు ఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

## 'ప్రజల సహకారంతో స్వచ్ఛ నల్లగొండ- హరిత నల్లగొండ'



నల్లగొండ : ప్రజల సహకారంతోనే స్వచ్ఛ నల్లగొండ- హరిత నల్లగొండ సాధ్యమవుతుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర అన్నారు. నల్లగొండ నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉదయం 12, 27, 28వ డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వారు తమ గృహ వ్యర్థాలను వీదుల్లో, ఖాళీ స్థలాల్లో లేదా డ్రైన్లలో వేయకుండా తప్పనిసరిగా మున్సిపల్ శానిటేషన్ వాహనాలకే అందించాలని విజ్ఞప్తి చేశారు. "ఇంటి చెత్తను శానిటేషన్ వాహనాలకే ఇవ్వండి -- నల్లగొండను పరిశుభ్రంగా ఉంచండి" అని పౌరుల కు పిలుపునిచ్చారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే నల్లగొండను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చన్నారు. డ్రైన్లలో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను వెంటనే తొలగించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రతిరోజూ స్వీపింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అలాగే కమర్షియల్ ఏరియాల్లో ప్రతిరోజూ విధిగా చెత్త సేకరణ జరగా లని సూచించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి ఇంటి నుండి తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు వేర్వేరుగా సేకరించాలన్నారు. గృహస్థులు తడి-పొడి వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం ద్వారా వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి జీరో ల్యాండ్ ఫిల్లింగ్ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్లు ప్రతిరోజూ ఫీల్డ్ మానిటరింగ్ నిర్వహించి పారిశుధ్య కార్యకలా పాలను పర్యవేక్షించాలన్నారు. ప్రజల నుండి వచ్చే పారిశుధ్య ఫిర్యాదులు, ప్రజా సమస్య లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దోమల నివారణ, ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో శానిటరీ సూపర్‌వైజర్ గడ్డం శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నంద్యాల ప్రదీప్తి, ఆర్‌ఓ శివరాంరెడ్డి, శానిటరీ జవాన్ కె.పరశురామ్, కాలనీ ప్రజలు పాల్గొ న్నారు.

## నీటి ఎద్దడి నివారణకు కృష్ణా జలాలు తెప్పిస్తాం : మంత్రి కోమటిరెడ్డి



నల్గొండ : నల్గొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్షించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కోమటిరెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైనన్ని లారీలు పెంచాలన్నారు. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలని సూచించారు. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూల్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ ఉండేలా చూడాలని చెప్పారు. నల్గొండ పరిధిలో 2.30 లక్షల టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని మంత్రి కోమటిరెడ్డి అంచనా వేశారు. ధాన్యం నిల్వల విషయంలో రూ. 11 వేల కోట్ల స్కామ్ ధాన్యం నిల్వల విషయంలో రూ. 11 వేల కోట్ల స్కామ్ జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక కొంతమేర ధాన్యం రికవరీ చేయించామని తెలిపారు. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. డైరెక్టర్, ఎండీని అరెస్టు చేశారు. ఇటీవల బెయిల్ వచ్చిందని మంత్రి వివరించారు. నల్గొండ జిల్లాలోనే రూ. 4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని చెప్పారు. బకాయిలు చెల్లించి రెగ్యులర్ గా నడుపుకోవాలని చెప్పామని వెల్లడించారు. చర్చల తర్వాత బకాయిలు చెల్లించే విధింగా ఒప్పకున్నారని తెలిపారు. నల్గొండ జిల్లాలో పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు రచించామని మంత్రి స్పష్టం చేశారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాలు తెప్పిస్తామని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు. ధాన్యం నిల్వల విషయంలో రూ. 11 వేల కోట్ల స్కామ్ ధాన్యం నిల్వల విషయంలో రూ. 11 వేల కోట్ల స్కామ్ జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక కొంతమేర ధాన్యం రికవరీ చేయించామని తెలిపారు. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. డైరెక్టర్, ఎండీని అరెస్టు చేశారు. ఇటీవల బెయిల్ వచ్చిందని మంత్రి వివరించారు. నల్గొండ జిల్లాలోనే రూ. 4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని చెప్పారు.

# అట్లీ రిస్క్ తీసుకోలేకపోతున్నారా



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు వస్తుందంటే సోషల్ మీడియాలో రచ్చ మామూలుగా ఉండదు. ఏప్రిల్ 8వ తేదీ కోసం అభిమానులు చాలా కాలంగా వెయిట్ చేస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో రాబోతున్న తన 22వ సినిమా "AA22 నుంచి ఏదైనా ఒక అదిరిపోయే వీడియో అప్డేట్ వస్తుందని అందరూ ఆశించారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. ఫ్యాన్స్ ఆశించిన గ్లింప్స్ లేదా టీజర్ ఈసారి రావడం లేదని తెలుస్తోంది. దీనికి బదులుగా కేవలం టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే మేకర్స్ సరిపెట్టే అవకాశం ఉంది. సాధారణంగా ఇంత పెద్ద ప్రాజెక్టుల విషయంలో గ్లింప్స్ రాకపోవడం అనేది అభిమానులకు కొంత నిరాశ కలిగించే విషయమే. కానీ ఇక్కడ దర్శకుడు అట్లీ ఒక పక్కా ప్లాన్‌తోనే అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. కేవలం పుట్టినరోజు కదా అని ఏదో ఒక వీడియోను హడావిడిగా వదలడం కంటే, క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఉండటమే మేలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రిస్క్ తీసుకోకుండా కేవలం ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌తోనే సినిమాపై ఉన్న క్రేజ్‌ను మెయింటైన్ చేయాలని టీమ్ డిసైడ్ అయ్యింది. అసలు విషయానికి వస్తే, ఈ అప్డేట్ ఆగిపోవడానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ అని తెలుస్తోంది. ఇదొక సైన్స్ ఫిక్షన్ సినిమా కావడంతో గ్రాఫిక్స్ పనితనం చాలా కీలకం. ప్రస్తుతం అనుకున్న స్థాయిలో విజువల్ అవుట్‌పుట్ రాకపోవడంతో, అరకొర విజువల్స్‌తో టీజర్‌ను రిలీజ్ చేయడం కంటే దాన్ని పక్కన పెట్టడమే ఉత్తమమని మేకర్స్ నిర్ణయించుకున్నారు. ఏదో ఒక వీడియోను రిలీజ్ చేసి ఆ తర్వాత నెగిటివ్ బజ్ తెచ్చుకోవడం కంటే, పర్ఫెక్ట్ టైమ్ కోసం వెయిట్ చేయడం మంచి స్ట్రాటజీ అని చెప్పొచ్చు. ఇటీవలి కాలంలో పెద్ద సినిమాలకు సోషల్ మీడియాలో మొదట్లో చిన్న నెగిటివ్ టాక్ వచ్చినా అది సినిమా ఫలితంపై గట్టి ప్రభావం చూపుతోంది. ఒకసారి నెగిటివ్ ఇంప్రెషన్ పడితే దాన్ని మళ్ళీ పాజిటివ్ గా మార్చుకోవడానికి చిత్ర బృందం చాలా కష్టపడాల్సి వస్తోంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ బడ్జెట్ సినిమా కావడంతో, మొదటి అడుగులోనే ఎలాంటి తప్పులు జరగకూడదని అట్లీ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మంచి కంటెంట్ ఉన్నప్పుడు అది కొంచెం ఆలస్యంగా వచ్చినా ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటారు. ఇక మేకర్స్ ఇవ్వబోయే అప్డేట్ ఎలా ఉంటుందో చూడాలి.

# లేడీ డైరెక్టర్ ట్రెండ్ సెట్ చేస్తుందా



సినీ రంగంలో మహిళలు నటనలోకి పెద్ద సంఖ్యలోనే వస్తారు కానీ.. టెక్నికల్ సైడ్ వెళ్లే వాళ్లు తక్కువ. అందులోనూ దర్శకత్వం వైపు అడుగులు వేసే వాళ్లు మరీ తక్కువ. ఇన్నేళ్ల తెలుగు సినీ చరిత్రలో కాస్త పేరున్న లేడీ డైరెక్టర్ల లిస్టు తీస్తే అది డబుల్ డిజిట్‌కు కూడా వెళ్లదు. ఈ తరంలో చెప్పుకోదగ్గ మహిళా దర్శకురాలు అంటే నందిని రెడ్డి మాత్రమే. ఆమెలా ట్రెండీగా సినిమాలు తీస్తూ పేరు సంపాదించిన మహిళా దర్శకులు మరొకరు కనిపించరు. ఐతే ఇప్పుడు నందిని తరహాలో పురుష దర్శకులకు దీటుగా ట్రెండీ సినిమా తీయగల సత్తా ఉన్న దర్శకురాలిగా మానస శర్మ అనే కొత్తమ్మాయి ఆశలు రేకెత్తిస్తోంది. నిహారిక కొణిదెల ప్రొడక్షన్లో ఒక షార్ట్ ఫిలిం చేసి మెప్పించిన ఈ అమ్మాయి.. ఈ శుక్రవారం విడుదల కానున్న 'రాకాస'తో ఫీచర్ ఫిలిం దర్శకురాలిగా పరిచయం అవుతోంది. ఈ సినిమా ప్రోమోలు చాలా ఆసక్తికరంగా అనిపించాయి. ఇది ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తే సినిమా అవుతుందనే అంచనాలున్నాయి. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో ఎంటర్టైన్మెంట్‌కు కేరాఫ్ అడ్రస్ అయిపోయాడు సంగీత్ శోభన్. మంచి కామెడీ టైమింగ్‌కు ఉన్న అతడితో హర్రర్ టచ్ ఉన్న ఫాంటసీ సినిమా చేయాలనుకోవడంతోనే మానస సగం విజయం సాధించింది. ప్రోమోల్లో కథాంశం, విజువల్స్, ఫన్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మానస నరేషన్ చాలా ట్రెండీగా అనిపించింది టీజర్, ట్రైలర్లలో. ఆమెను నమ్మి నిహారిక పెద్ద బడ్జెట్టే పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ కూడా బాగున్నాయి. కావాల్సిందల్లా మంచి టాకే. ఈ రోజు రాత్రి ప్రిమియర్స్ నుంచి టాక్ వచ్చిందంటే 'రాకాస' మంచి విజయం సాధించబోతున్నట్లే. అదే జరిగితే తెలుగు సినిమాకు చాన్నాళ్ల తర్వాత ఓ ట్రెండీ లేడీ డైరెక్టర్ దొరికినట్లే. మానస లుక్స్.. 'ఓయ్' సినిమాలో షామిలిని తలపించేలా ఉండడంతో ఆమె ఆల్రెడీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇక కంటెంట్‌తోనూ మెప్పించిందంటే తన పేరు మార్మోగడం ఖాయం.

# గురుకుల పాఠశాలల తనిఖీల్లో కలెక్టర్

టేకులపల్లి,: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. గోల్యాతండా పంచాయతీ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, బద్దతుండా ఏకలవ్య పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన ఆయన.. అది ఎప్పుడు ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా ఎందుకు వినియోగంలో లేదనే అంశంపై అధికారులను ప్రశ్నించారు. త్రీఫేస్ విద్యుత్ సమస్యను పరిష్కరించి, ఆర్వో ప్లాంట్ వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. పాఠశాలలో వంట గదులు, సామగ్రి, పరిసరాల పరిశుభ్రత, భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో స్వయంగా మాట్లాడి.. వారికి అందుతున్న సదుపాయాలు, భోజన నాణ్యత వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పఠనా సామర్థ్యం పెంపొందించాలని, బోధనా నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన ఆయన.. అది ఎప్పుడు ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా ఎందుకు వినియోగంలో లేదనే అంశంపై అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి శ్రీరామ్, తహసీల్దార్ వీరభద్రం, ఏవో అన్నపూర్ణ, ఎంపీవో గాంధీ, సర్పంచ్‌లు లకావత్ నాకానాయక్, బానోత్ నరేశ్ తదితరులు ఉన్నారు.

# త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

ఖమ్మం, : తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఎన్నికల నగా రా మోగనుంది.. అతి త్వరలో స్థానిక ఎన్నికలు జరిగే అవ కాశం ఉంది.. ఈ మేరకు ఎన్నికల నిర్వాహణకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.. అందుకు గాను రాష్ట్ర ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది.. మొదటి దఫాగా ఓటర్ల జాబితాను సిద్దం చేసే పనిలో నిమగ్నమైంది. ఈనెల 23 వరకు ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. సవరించిన జాబితాను సిద్ధం చేసి, త్వరలో ప్రచురితం చేయాలని సూచించింది. దీంతో ఒక్క సారిగా రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైంది. ఒక్కసారిగా రాష్ట్రంలో ఎన్నికల వాడివేడీ ప్రారంభమైంది. మరోసారి స్థానిక ఎన్నికలు జరిగే వాతావరణం కనిపిస్తోంది. దీంతో పల్లెల్లో రాజకీయ వాడీవేడి ప్రారంభమైనట్లైంది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసే యోచనలో ఉన్నట్లు పుకార్లు షికార్లై ప్రచారం చేశాయి. సోషల్ మీడియాలో, టీవీలలో, పత్రికల్లో ఈ వార్తలు చెక్కర్లు కొట్టాయి.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉండవు, సర్పంచులందరు కలిసీ ఎంపీపీ, వారందరు కలిసి జడ్పీచైర్మన్ ను ఎన్నుకుంటారు. అందుకే రాబోయే కాలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉండవు అనే ప్రచారం జోరుగా సాగింది.. దీంతో రాజకీయ నాయకులు, ఆశావాహులు ఎంపీటీ, జడ్పీటీసీ ఎన్నికలపై ఆశలు వదులుకున్నారు. ఈ తరుణంలో ఈసీ నిర్ణయం అందర్ని అశ్చర్యానికి గురిచేసింది. ఓటర్ల జాబితాలను నవీకరించాలని జిల్లా అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఒక్కసారిగా రాష్ట్రంలో మరోసారి ఎన్నికల వాతావరణం ప్రారంభమైంది. ఎన్నికలపై ఆశలు వదులుకున్న రాజకీయ నాయకులు, ఆశావాహులు, కార్యకర్తలు ఒక్కసారిగా నిద్రలేచిన పులిలా కనిపించారు. పల్లెల్లో ఎంపీటీసీ ఎన్నికల గురించి జోరుగా చర్చ ప్రారంభమైంది. సోషల్ మీడియాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించుకుంటున్నారు. మొత్తానికి మండు ఎండల్లో పల్లెల్లో రాజకీయ వేడీ ప్రారంభమైనట్లే కనిపిస్తోంది.. గతేడాది జరగాల్సి ఉండగా..? తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కంటే ముందు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాలని భావించింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఎన్నికలను నిర్వహించాలని అనుకుంది. అందుకు సంబంధించి అక్టోబర్ 8,2025న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల సంఘం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఖమ్మం జిల్లాలో జడ్పీటీసీ స్థానాలకు 2 నామినేషన్లు, ఎంపీటీసీ స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలై య్యాయి. కానీ బీసీ రిజర్వేషన్లపై ఉన్నతన్యాయస్థానం సంచలన ప్రకటన చేసింది. బీసీ రిజర్వే షన్లను తప్పుపడుతూ ఎన్నికలను నిలిపివేయాలని ఆదేశించింది. పాత పద్దతిలో ఎన్నికలను నిర్వహిం చుకోవాలని ఆదేశించినప్పటికి అప్పటికప్పుడు ఎన్నికల నిర్వహాణ సాధ్యం కాలేదు. ఆ తరువాత గత రెండు నెలల క్రితం పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం, ఆ తరువాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వాహణను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఖమ్మం జిల్లాలో 20 జడ్పీటీసీ, 283 ఎంపీటీసీ స్థానాలుఖమ్మం జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉన్నాయి. 8,02,690 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,88,243 మంది పురుషులు, 4,14,425 మంది మహిళలు, 22 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు. జిల్లాలో మొత్తం 1580 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 283 ప్రాథమిక నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో 290కి పైగా స్థానాలు ఉండగా, కొన్ని మున్సిపాలిటీలో వెళ్లడంతో 283 ఎంపీటీసీ స్థానాలుగా ప్రభుత్వం గుర్తించి ప్రకటించింది. అందులో బోనకల్లు మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, చింతకానిలో 14 స్థానాలు, ఏన్కూరులో 10, కల్లూరులో 13, కామేపల్లిలో 12, ఖమ్మం రూరల్ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కొణిజర్లలో 15, కూసుమంచిలో 17, మధిరలో 12, ముదిగొండలో 17, నేలకొండపల్లిలో 18, పెనుబల్లిలో 15, రఘునాథపాలెంలో సత్తుపల్లిలో 13, సింగరేణిలో 16, తల్లాడలో 16, తిరుమలాయపాలెంలో 18, వేంసూరులో 13, వైరాలో 10, ఎర్రుపాలెంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. జులైలోనే ఎన్నికలు..? ఒక వైపు ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రీయ ప్రారంభించినప్పటికి ఏ నెలలో ఎన్నికలను నిర్వహిస్తారనే సందేహాలు నెలకొన్నాయి.. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం దైర్యం చేయలేదు. అలాగే మే 11 నుంచి జూన్ 9 వరకు కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రక్రియను తెలంగాణలో ప్రారంభిస్తుంది.. ఒక వైపు జనగణన జరుగుతుంటే, మరో వైపు ఎన్నికలను నిర్వహించే అవకాశం లేదు. దీంతో కచ్చితంగా మే, జూన్ నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశమే లేదు. అయితే జులైలో వానాకాలం ప్రారంభం కావడం, వాతావ రణం చల్లబడటం, చిరు జల్లులు కురిసే అవకాశం ఉండటం, ప్రజలందరు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటారు. అందుకే జులై మొదటి వారంలో లేదా.. రెండవ వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. వానాకాల ప్రారం భంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని మంత్రి స్పష్టం చేసిన నేపథ్యంలో జులై మాసంలోనే కచ్చితంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.. చూద్దాం ఎన్నికల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందో..?

# ఏప్రిల్ 25 వరకు దేశంలో తీవ్ర వడగాల్పులు








న్యూఢిల్లీ: దేశంలో ఎండలు మండిపోతున్నాయి. ఇప్ప టికే భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతుండగా రానున్న నాలుగైదు రోజుల పాటు దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు (హీట్ వేవ్స్) వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్ 25 మధ్య హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, తూర్పు రాజ స్తాన్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్తాన్, మధ్యప్రదేశ్, గంగానది పరివాహక పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. ఈశాన్య రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలుఈశాన్య రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో ఏప్రిల్ 23 వరకు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని పేర్కొంది. అదే విధంగా నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురల్లోనూ ఏప్రిల్ 23 వరకు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని అంచనా వేసింది. ఐఎండీ ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్‌లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావచ్చని, రవాణా సౌకర్యాలకు కూడా అంతరాయం కలగవచ్చని పేర్కొంది. అంతేకాక స్థానికంగా వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక దేశంలోని పశ్చిమ హిమాలయ ప్రాంతాలైన జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో హిమపాతం, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వెస్టర్న్ డిస్టర్బెన్సెస్, చక్రవాత పరిభ్రమణాల వంటి వివిధ వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయని వెల్లడించింది. ఉరుములతో కూడిన వర్షాలు, వడగండ్ల వానలు దక్షిణ, మధ్య, తూర్పు, వాయువ్య భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో మోస్తరు నుంచి తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అలాగే మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లో వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. తీవ్ర ఉక్కపోత "ఏప్రిల్ 26 మధ్య గంగా పరివాహక పశ్చిమ బెంగాల్, ఏప్రిల్ 20-22 మధ్య తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, ఏప్రిల్ 24 మధ్య కేరళ, మాహే, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, యానాం, ఏప్రిల్ 24, 25 తేదీల్లో గుజరాత్ తీర ప్రాంతాల్లో ఉక్కపోతతో కూడిన వేడి వాతావరణం ఉండే అవకాశం ఉంది" అని ఐఎండీ పేర్కొంది. రాత్రి వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు హర్యా నా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, విదర్భ ప్రాంతాల్లోనూ, ఒడిశాలో రాత్రి వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని ఐఎం డీ వెల్లడించింది. ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో చిన్నపిల్లలు, వృద్ధులు సహా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లడం మంచిది కాదని చెబుతున్నారు. చెమట రాకపోవడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# రక్షణ కవచం విఫలమైంది.. గల్ఫ్‌కు చేదు అనుభవం

గల్ఫ్, ఇరాన్ ఆయుధ శక్తిని ఎదుర్కోవడానికి అమెరికా ప్రభుత్వం క్షిపణి రక్షణ వ్యవస్థలను రూపొందిం చింది. వీటి కోసం గల్ఫ్ దేశాలు బిలియన్ల కొద్దీ నిధులను... ఏకంగా 142 బిలియన్ డాలర్లను కుమ్మరించాయి. కానీ జరిగిందేమిటి? ఇరాన్ ప్రతీకార దాడులకు దిగినప్పుడు వాటి పరిమాణం, వ్యయ అసమానతలు అంచనాలను తలకిందులు చేశాయి. మధ్యప్రాచ్యంలోని గల్ఫ్ దేశాలకు మిగిలింది కాలిపోయిన థాడ్ వ్యవస్థలు, ఖరీదైన గుణపాఠం మాత్రమే. గల్ఫ్ దేశాలకు అమెరికా ఇస్తానని చెప్పిన భద్రతా వ్యవస్థలలో ప్రధానమైనది లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్ (థాడ్). దీనితో పాటు పేట్రియాట్ పీఏసీ-3 బ్యాటరీలు కూడా ఉన్నాయి. అమెరికాలో ప్రభుత్వ ప్రాధాన్యతలను నిర్దేశించేది రక్షణ సంస్థలే కాబట్టి ఈ వ్యవస్థలు అత్యున్నత ప్రమాణాలతో కూడుకున్నవంటూ ఊదర కొట్టారు. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను ఈ వ్యవస్థలు సమర్ధ వంతంగా తిప్పికొడతాయని నమ్మించారు. ట్యాంకర్లతో యుద్ధం చేసే కాలం నాటి నుంచి క్షిపణుల నుంచి పొంచి ఉన్న ముప్పును ఈ వ్యవస్థలు తొలగిస్తాయని నమ్మిన గల్ఫ్ దేశాలు అనేక సంవత్సరాలుగా వాటిపై అనేక బిలియన్ డాలర్లు వెచ్చిస్తున్నాయి. టెహ్రాన్ దాడులతో కకావికలం జోర్డాన్, సౌదీ అరేబియా, యూఏఈలలోని థాడ్ రాడార్లపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు నేరుగా దాడి చేయగలిగాయి. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం తగలబడిపోయింది. జోర్డాన్‌లోని మువాఫక్ వైమానిక స్థావరంలో ఉన్న రాడార్ ప్రదేశంలో శకలాలు మాత్రమే మిగిలాయి. యుఏఈలోని అల్ రువాయిస్ సమీపంలో ఉన్న థాడ్ బ్యాటరీపై పలు దఫాలుగా దాడి జరిగింది. ఇరాన్ వైపు నుంచి వచ్చిన పలు ఆయుధాలను అడ్డుకోవడంలో పాట్రియట్ వ్యవ స్థలు ఆపసోపాలు పడ్డాయి. వీటిలో కొన్నింటిని మాత్రమే ఆ వ్యవస్థలు అడ్డుకోగలిగాయి. పైగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు అత్యంత చౌకైనవి. వీటిని తిప్పికొట్టడానికి అమెరికా వ్యవస్థలపై భారీగా ఖర్చు చేశారు. హౌతీల దాడులను పెద్ద ఎత్తున అడ్డుకుంటున్నామని గతంలో ప్రకటనలు చేసిన యూఏఈ, ఇప్పుడు పెదవి విప్పడం లేదు. ఇరాన్ నెల రోజులకు వందకు పైగా క్షిపణులను తయారు చేస్తోందని, వాటిని అడ్డుకునేందుకు తాము నెలకు ఆరేడు వ్యవస్థలను మాత్రమే నిర్మించగలుగుతున్నామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చేసిన వ్యాఖ్య ఈ సందర్భంగా గమనార్హం. థాడ్ వ్యవస్థలు నిర్వీర్యమైన నేపథ్యంలో వాటికి సంబంధించిన బ్యాటరీ లను దక్షిణ కొరియా నుంచి మధ్య ప్రాచ్యానికి తరలించేందుకు అమెరికా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. దక్షిణ కొరియా అధ్యక్షుడు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఈ చర్యను అడ్డుకోలేక పోయారు. ఇప్పుడు గల్ఫ్ దేశాలకు... ముఖ్యంగా సౌదీ అరేబియాకు వాస్తవమేమిటో అర్థమవు తోంది. గల్ఫ్‌లోని అమెరికా ఆస్తులే లక్ష్యంఇరాన్, సౌదీ అరేబియా 2023 మార్చిలో దౌత్య సంబంధాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరిం చుకున్నాయి. చైనా మధ్యవర్తిత్వంతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఇరాన్‌పై దాడులకు అమెరికా సిద్ధం కావడంతో గల్ఫ్ దేశాలు మరోసారి దౌత్య యత్నా లు చేశాయి. ఇరాన్‌పై దాడులకు అమెరికా తన స్థావరాలను ఉపయోగించుకునేందుకు సౌదీ అరేబియా నిరాకరించింది. ఇరాన్ ప్రతీకార దాడులపై అనేక గల్ఫ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి కూడా. అయితే అమెరికా-ఇజ్రాయిల్ చర్య లతో గల్ఫ్ దేశాలకు మరో మార్గం లేకపోయింది. అమెరికా అందించిన హార్డ్‌వేర్ వ్యవస్థలు పనిచేస్తాయా లేదా అని తెలుసుకునేందుకు అవి ప్రయత్నించాయి. గల్ఫ్ దేశాలలోని అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ 400 బాలిస్టిక్ క్షిపణులను, సుమారు వెయ్యి డ్రోన్లను ప్రయోగించింది. బహ్రైన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్, యూఏఈలలోని పట్టణ ప్రాంతాలు, ఇంధన స్థావరాలు, విమానాశ్రయాలు, పౌర మౌలిక సదుపాయాలపై టెహ్రా న్ దాడులు జరిపింది. సౌదీతో భారీ ఒప్పందం గత సంవత్సరం మేలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రియాద్‌లో పర్యటించినప్పుడు తన దేశ చరిత్రలోనే అతి పెద్దదైన సైనిక సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అది సౌదీ అరేబియా కోసం ఉద్దేశించిన 142 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీ. ఇందులో థాడ్ వ్యవస్థలు, పాట్రియాట్ పీఏసీ-3 ఆధునీకరణలు, క్షిపణులు, గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయో గించే అత్యాధునికమైన ఆయుధాలు, సాయుధ డ్రోన్లు, మందుగుండు సామగ్రి ఉన్నాయి. ఇరాన్, దాని మిత్రుల నుంచి ముప్పు ఎదురైనప్పుడు దానిని ఎదుర్కో వడానికి సౌదీ సైన్యాన్ని సన్నద్ధం చేయడమే ఈ ప్యాకేజీ ఉద్దేశం. తొమ్మిది నెలల తర్వాత ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయిల్ దాడి చేసిన సమయంలో ఈ వ్యవస్థలను ఉపయోగించారు. అయితే వీటిని ఇరాన్ సమర్ధవంతంగా తిప్పి కొట్టింది. ఫలితంగా అమెరికా అందించిన రక్షణ కవచం విఫలమైంది.

# అభివృద్ధి చేయడమే లక్ష్యం- కేంద్ర మంత్రి బండి



కరీంనగర్, : కరీంనగర్ నగరపాలక సంస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకంలో 5.82 లక్షల నిధులతో చెరువుల సుంధరీకరణ పనులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. నగరంలోని 2 వ డివిజన్ పరిదిలో గల తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువులను సంధర్శించి...నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి అమృత్ 2.0 పథకంలో 1.21 కోట్ల నిధులతో తీగలగుట్టపల్లి మాలకుంట చెరువు, 2.86 కోట్ల నిధులతో కొత్తపల్లి ఊర చెరువుల సుంధరీకరణ పనులను భూమీ పూజ చేశారు. ఈ సంధర్బంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.... నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచే పర్యటక ప్రాంతాలుగా చెరువులను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నగరానికి ఆనుకోని ఉన్న మూడు చెరువులను సుంధరీకరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నుండి 5.82 లక్షల నిధులను విడుదల చేశామన్నారు. గతంలో తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువుల వద్ద వినాయక, బతుకమ్మ నిమజ్జనాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా... వీటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక నిధులను విడుదల చేశామన్నారు. చెరువుల సుంధరీకరణ పనుల్లో ప్రజలకు అవసరమైన ఘాట్స్ నిర్మాణం, చెరువు కట్ట విస్తరణ తో పాటు బలంగా చేయడం, స్టోన్ స్టిచ్చింగ్, సీవరేజ్ వాటర్ కలవకుండా డ్రైనేజీల డైవర్షన్, ప్రొటక్షన్ వాల్, రేలింగ్, చక్కటి లైటింగ్, గ్రీనరీ, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి.. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు.

# సమన్వయంతో కృషి చేయాలి



భువనగిరి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా పూర్తయిందని, తెలంగాణలో కూడా అదే స్థాయిలో పురోగతి సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆర్వోలు తమ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు), సూపర్వైజర్లకు స్పష్టమైన దిశానిర్దేశం అందిస్తూ క్షేత్రస్థాయిలో పనులను క్రమబద్ధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకంపై ఇప్పటికే ఆయా పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున, వారి సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓలతో సమన్వయం పెంచుకుని మ్యాపింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకు ముందుకు రావడం ద్వారా మిగిలిన ప్రాంతాల్లో పనులను వేగంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి ,భువనగిరి తాసిల్దార్ జగన్మోహన్ ప్రసాద్ , ఎలక్షన్స్ సెల్ సూపరిండెంట్ కృష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్టు: ఎస్పీ నర్సింహ



సూర్యాపేట : గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను ఆత్మకూర్.ఎస్ పోలీసులు అరెస్టు చేసి రూ.మూడు లక్షల విలువైన ఐదు కిలోల గంజాయి, కారు, బైక్, సెల్ ఫోన్లు సీజ్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ నర్సింహ వివరాలు వెల్లడించారు. ఆత్మకూర్.ఎస్ గ్రామ శివారులో క్రషర్ మిల్లు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. నెమ్మికల్‌కు చెందిన వీరబోయిన భరత్, జాజిరెడ్డిగూడెం, కొమ్మాల గ్రామానికి చెందిన అరె విజయ్, సూర్యాపేట మండలం ఆరెగూడానికి చెందిన చెవుల మనోజ్, నెమ్మికల్ గ్రామానికి చెందిన కొడిదల శివ జల్సాలకు అలవాటు పడి గంజాయి తెచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం భరత్, విజయ్, మనోజ్ ముగ్గురూ కలిసి కొడిదల శివకు చెందిన మోటార్ సైకిల్‌పై ఏపీలోని సీలేరుకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తెచ్చేవారు. తెచ్చిన గంజాయిని పంచుకునేందుకు నలుగురూ ఆత్మకూర్ శివారులోని క్రషర్ మిల్లు వద్దకు చేరుకున్నారు. నమ్మదగిన సమాచారం అందుకున్న ఆత్మకూర్ పోలీసులు అక్కడకు చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకొని, ఐదు కిలోల గంజాయిని, మనోజ్ కారును, శివ బైక్‌ను సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను అరెస్టుకు కృషి చేసిన సూర్యాపేట రూరల్ సీఐని, ఆత్మకూర్ ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజ శేఖర్, ఆత్మకూర్.ఎస్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచు కుంటుంది



కోదాడ : విపత్తుల సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలాజీ నగర్ అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోదాడ ఫైర్ స్టేషన్కు త్వరలోనే సరికొత్త ఫైర్ ఇంజిన్ వాహనాన్ని మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిబ్బంది, బాలాజీ నగర్ ప్రజల కోసం కార్యాలయ ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది నిరంతరం ప్రజల భద్రత కోసం కృషి చేస్తూ అత్యవసర సమయాల్లో సేవలు అందించడం గర్వకారణమని అన్నారు. వారి సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో వివిధ అధికారులతో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. చిలుకూరులో ఎన్డీసీసీబీ బ్రాంచ్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, జిల్లా అగ్నిమాపక అధికారి వై కృష్ణారెడ్డి, స్టేషన్ అగ్నిమాపక అధికారి డాక్టర్ బాబు, స్థానిక కౌన్సిలర్ రామిశెట్టి ఉదయశ్రీ హరిప్రసాద్, చైతన్య నాయక్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# 'పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలి'

నల్లగొండ : చిన్నారులు, గర్భిణులు, బాలింతలో రక్తహీనత తను తగ్గించేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా ప్రోత్సాహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినోదకుమారి అన్నారు. నల్లగొండ పట్టణంలోని చైతన్యపురి కాలనీ సెక్టార్ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని రైతు బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలామంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని దీనివల్ల చిన్నారులు బలహీనంగా అనారోగ్యంతో జన్మించి చనిపోతున్నారని తెలిపారు. దీన్ని అదిగమించేందుకు ప్రభుత్వం పోషణ్ అభియాన్ పేరుతో వెయ్యి రోజుల కార్యక్రమాన్ని తీసుకు వచ్చిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వార బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నందున సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా చిన్నారులు పౌష్టికాహారం లోపాన్ని అదిగమించేందుకు గర్భిణులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఏ రకమైన భోజనం తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు.

# పనులు నిర్ణీతకాలంలో పూర్తి చేయాలి- మంత్రి తుమ్మల

ఖమ్మం, : నగర అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 44వ డివిజన్లో కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల అంగీకారంతో అవసరమైన చోట్ల రోడ్డు విస్తరణ పనులు చేపడతామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పూనుకొల్లు నీరజ, కమీషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బ్రహ్మోత్సవ వేడుకలు

వరంగల్, : చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగగా, మొదటి రోజు కార్యక్రమాలలో భాగంగా ధ్వజారోహణం జరిగింది. ధ్వజారోహణానికి ముందుగా చరుస్థానార్చన నిర్వహించిన అనంతరం భేరీపూజ జరిపి భేరీ తాడనం దేవతాహ్వానం ఆలయ అర్చకులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పర్వతరాజకుమారి (మహేశ్వరి)గా అలంకరించి వృషభ వాహనం మీద, సాయంకాలం అమ్మవారిని మృగవాహినిగా అలంకరించి ఊరేగింపు జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర సాంకేతిక విద్య ముఖ్య కార్యదర్శి దేవసేన అమ్మవారిని దర్శించుకున్నారు. అక్షయ తృతీయ కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

నల్లగొండ: కోడలి ఆత్మహత్యకు కారణమైన మామను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను సీఐ రాఘవరావు వెల్లడించారు. నాంపల్లి మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన ఐశ్వర్య (20)కు ఐదు నెలల క్రితం పానగల్లుకు చెందిన శివశంకర్‌తో వివాహం జరిగింది. భర్త ఇంట్లో లేని సమయంలో మామ వర్రే లింగయ్య తరచూ వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు. ప్రతి చిన్న విషయానికీ తప్పు పట్టడం, అవమానించడం, మానసికంగా హింసించడం చేసినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదులో తెలిపారు. "నువ్వు చస్తే నా కొడుకుకు ఇంకా మంచి భార్య వస్తుంది" అంటూ తీవ్రంగా మామ లింగయ్య కొడలిని వేధింపులకు గురి చేసేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక ఐశ్వర్య ఉదయం పానగల్లు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి చింతల వెంకటయ్య ఫిర్యాదుతో నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి వర్రే లింగయ్య (45)ను ఈరోజు ఉదయం అతడి నివాసంలో అరెస్టు చేశారు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచేందుకు రిమాండ్‌కు తరలింపు.

# అదనపు కాటేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి- మంత్రి జూపల్లి



హైదరాబాద్, రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రాయోజిత, ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోను ఇప్పటికే చేపట్టిన, ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. హిమాయత్‌నగర్‌లోని పర్యాటక అభివద్ధి సంస్థ (టీజీటీడీసీ) కార్యాలయంలో టీజీటీడీసీ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి ఆయన పర్యాటకశాఖపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ పర్యాటక ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనుల ప్రగతి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అంతేగాక వివిధ పర్యాటక ప్రాజెక్టుల పనులను చేపట్టి ఎప్పటిలోగా పూర్తి చేసే నెలవారీ షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో రూ. 274.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల పురోగతిని జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, కొత్త ప్రాజెక్టుల డీపీఆర్ ల తయారీ, నూతన కాటేజీల నిర్మాణం, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాద్, సాస్కీ, సీడీబీడీ ద్వారా చేపట్టిన పనులు- నిధుల విడుదల, ఆరు ప్రత్యేక పర్యాటక ప్రాంతాల (ఎస్‌టీఏలు- ఆధ్యాత్మికం, వారసత్వం, ఎకో- వెల్నెస్, హస్తకళలు, జల, బౌద్ధ సర్క్యూట్ల) కోసం సమగ్ర మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, నాగార్జునసాగర్, రామప్ప-వరంగల్, యాదగిరిగుట్ట-పోచంపల్లి, సోమశిల-ఆలంపూర్ ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్, కొత్త బోటింగ్ యూనిట్ల ప్రతిపాదనలు, గిరిజన పర్యాటకం, హరిత హోటళ్ల నిర్వహణ- మరమ్మత్తులు, హౌస్ బోట్లు, కల్చరల్ టూరిజం, రవాణా సౌకర్యం, మౌలిక వసతుల కల్పన, తదితర అంశాలపై మంత్రి జూపల్లి అధికారులతో చర్చించారు. రామప్ప ఆలయ సమీపంలోని అనువైన ప్రాంతాల్లో అదనపు కాటేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన చోట సాంప్రదాయ బోట్‌ల స్థానంలో ఆధునాతన బోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలనీ, సోమ శిలలో అదనపు బోటును కూడా అందు బాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎత్తయిన ప్రాంతాల్లో, అనువైన వాటర్ బాడీల వద్ద రష్యా, చైనా వంటి దేశాల్లో ఉన్న క్యాంటీ లివర్ వ్యూ పాయింట్స్ (గ్లాస్ స్ట్రక్చర్స్) ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. వారసత్వ సంపదను సంరక్షించడంతో పాటు పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. తద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగి ఆదాయం సమకూరుతుందని గుర్తు చేశారు. చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం అవసరమైతే పర్యాటక శాఖ నుంచి నిధులు మంజూరు అయ్యేలా చూస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఇప్పటికే చేపట్టిన పలు పర్యాటక ప్రాజెక్టులతో పాటు ప్రతిపాదిత ప్రాజెక్టులను సైతం సకాలంలో పనులు చేపట్టి నిర్దిష్ట గడువు ప్రకారం పూర్తి చేసి ప్రజలకు ముఖ్యంగా పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా పర్యాటక ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర పర్యాటక రంగ అభివద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని, విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివద్ధి పథంలో తీసుకెళ్లాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దుతూ, పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం సష్టించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించేందుకు హంపీ థియేటర్లు నిర్మించాలనీ, తద్వారా స్థానిక కళాకారులకు జీవనోపాధి లభిస్తుందని చెప్పారు. ఈ సమీక్షలో టీజీటీడీసీ ఛైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి, స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, ఎండీ గౌతమి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం వల్ల సాధారణ ప్రజలు చాలా నష్టపోయారు...



న్యూఢిల్లీ: ఇరాన్‌పైన అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు సాగించిన యుద్ధం వల్ల ప్రపంచం, సాధారణ ప్రజలు చాలా నష్టపోయారు. సంధి ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ అమెరికా అహంకారంవల్ల అవి సజావుగా ముగుస్తాయనే గ్యారంటీ ఏమీ కనపడటం లేదు. అందువల్ల యుద్ధం కొనసాగే ప్రమాదమూ ఇంకా మన వెన్నంటే ఉంది. అదే జరిగితే ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్‌తోపాటు, అన్ని సరుకుల ధరలూ భారీగా పెరగటం, ఆ దేశాలేగాక ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సంక్షోభాలకు గురికావటం తప్పనిసరి. అది అంతటితో ఆగదు. వివిధ దేశాలలో ఈ ఆర్థిక సంక్షోభం సామాజిక అస్థిరతకూ, ప్రజల తిరుగుబాట్లకూ దారితీయవచ్చు. ఈ విషయంలో ఎవరికీ దాదాపు భిన్నాభిప్రాయలేమీ లేవు. అయితే ఈ యుద్ధానికి కారణాలేమిటి అనే విషయంలో మాత్రం రక, రకాల వాదనలతో ముందుకొస్తున్నారు. 'ఏ మాటల వెనక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోలేనంతకాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు' అంటాడు లెనిన్ మహాశయుడు. అందువల్ల ఈ వాదనల గుట్టు ప్రజలకు అర్థం చేయించటం అవసరం. యురేనియం శుద్ధి చేయటం ద్వారా ఇరాన్ అణ్వస్త్రాల తయారికి పూనుకుంటోందని దాన్ని అడ్డుకోవటానికే ఈ యుద్ధమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నాడు. మరయితే 2015లోనే దీన్ని కట్టడి చేస్తూ ఇరాన్, అమెరికాలే కాకుండా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశాలన్ని (చైనా, రష్యాలతో సహా) సంతకాలు చేసి, అమలు చేస్తున్న ఒప్పందాన్ని ట్రంప్ తాను అధికారంలోకి వచ్చిన మొదటిసారే 2018లో ఏకపక్షంగా ఎందుకు రద్దు చేశాడు? తరువాత తన హయాంలోనే ఒమన్ దేశం మధ్యవర్తిగా చర్చలు నడిపిన రెండుసార్లూ దాదాపు ఒప్పందానికి వచ్చిన దశలో చర్చలు సాగుతుండగానే ఇరాన్‌పై బాంబుల దాడి ఎందుకు చేసారు? ఇజ్రాయిల్ ఇప్పటికే అణుబాంబు తయారు చేసిందనేది అందరికీ తెలిసినా ఎవరూ ఎందుకని ప్రశ్నించటం లేదు? కాబట్టి అమెరికా దాడికి ఇరాన్ అణుకార్యక్రమం అసలు కారణం కాదనేది స్పష్టం. ఇరాన్ పాలన పట్ల ప్రజల అసంతృప్తి ఉందనీ, ప్రజలను అణచివేస్తున్నారనీ ఆ పాలనను మార్చటం తమ లక్ష్యమనీ ట్రంప్ చెబుతున్నాడు. ఇది సరైందేనా? ఇరాన్‌యే కాదు, ఇంకా చాలా దేశాల పరిపాలనలు కూడా బాగాలేవు. అమెరికా,ఇజ్రాయిల్‌లో పరిపాలనలు బాగున్నాయా? అమెరికా మిత్రులుగా ఉన్న సౌదీ అరేబియా లాంటి దేశాలలో ప్రజాస్వామ్యమే లేదు గదా? వాటిని మార్చమని ఇతర దేశాలేవైనా వాటిపైన దాడి చేయవచ్చా? అమెరికా చెబుతున్న గొప్ప ప్రజాస్వామ్య సూత్రానికి అర్థమేమిటి? ఏ దేశ ప్రభుత్వంలో ఎవరుండాలనేది నిర్ణయించుకోవాల్సింది ఆ దేశ ప్రజలే తప్ప వేరే దేశాల ప్రభుత్వాలు కావు. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానాలు అందరూ అంగీకరించిన విలువలు అమలు చేయాలి. అలాకాకుండా బలవంతులు, బలహీనులను వేటాడటం ఆటవిక న్యాయం కాదా? అందువల్ల ట్రంప్ ఇరాన్‌లో పాలనను మార్చటం అనే లక్ష్యం ప్రకటించటంలోనే తప్పుంది. గతంలో ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ రసాయనిక ఆయుధాలు తయారుజేస్తున్నాడనే సాకుతో ఆ దేశంపై అమెరికా దాడి చేసి సర్వనాశనం సృష్టించారు. తీరా తేలిందేమంటే అక్కడ అలాంటి ఆయుధాలే లేవని! ఇటీవల వెనిజులా మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నదనే సాకుతో ఆ దేశంపై దాడిచేయటం అధ్యక్షుడు మధురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేసి అమెరికాలో నిర్బంధించటం మనకు తెలిసిందే. ఇరాన్, ఒమన్ దేశాల మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి ద్వారా రోజూ 150కి పైగా రవాణా నౌకలు ప్రయాణిస్తుంటాయి. ఈ మార్గం ద్వారానే ప్రపంచ దేశాల వినిమయంలో ఇరవై శాతం వరకూ ఆయిల్ సరఫరా అవుతుంటుంది. అమెరికా దాడికి నిరసనగా ఇరాన్ ఈ మార్గాన్ని మూసేసింది. దీన్ని ఇరాన్ తెరిస్తే తాను యుద్ధం ఆపేస్తానంటున్నాడు ట్రంప్. వాస్తవంగా ఆయన దాన్ని తిరగేసి చెబుతున్నాడు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ సుప్రీం లీడర్ ఖొమైనీ సహా నలభై మందికి పైగా అగ్రనాయకులను అమానుష దాడితో హత్యలు చేయటం, ఇరాన్ మొత్తం దేశం తనకు బేషరతుగా లొంగకపోతే ఆ దేశాన్ని ప్రపంచ పటంలోనే లేకుండా అంతం చేస్తానని హెచ్చరించటం, వైమానిక దాడుల ద్వారా పౌర సౌకర్యాలన్నింటినీ ధ్వంసం చేయడం జరిగింది. ఆ తర్వాతనే ఇరాన్ ఆ జలసంధిని మూసివేయటం ద్వారా తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నించింది. అంటే అమెరికా అక్రమ యుద్ధం వల్ల ఇరాన్ జలసంధి మూసివేతను ప్రకటించింది తప్ప ఇరాన్ మూసివేయటం వల్ల అమెరికా యుద్ధం ప్రారంభించ లేదు. అంతర్జాతీయ సముద్ర జలాల ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలాలగుండా ప్రయాణించటం అన్ని దేశాల హక్కనీ, దానికి ఇరాన్ అడ్డుతగులుతోందనీ అమెరికా ఇంకొన్ని దేశాల వాదనగా ఉంది. కానీ అదే ఒప్పందంలోనే ఉన్న మరో ముఖ్య విషయాన్ని వాళ్లు ప్రజలకు తెలియకుండా దాటవేస్తున్నారు. అదేమిటంటే ఏ తీర ప్రాంత దేశానికైనా 12 నాటికల్ మైళ్ల (1నాటికల్ మైలు = 3.5 కి.మీ) వరకూ సముద్ర జలాలలై సార్వభౌమాధికారం ఉంటుందని కూడా ఆ ఒప్పందంలోనే చెప్పబడింది. ఆ ప్రకారం హోర్ముజ్ జలసంధి తీరదేశాలైన ఇరాన్, ఒమన్‌లకు కలిపితే ఆ మొత్తం జలసంధిపైన ఆ రెండు దేశాలకు మాత్రమే సర్వాధికారాలు ఉంటాయి. ఆ మేరకు 1974లో ఆ దేశాల మధ్య ఒప్పందం కూడా కుదిరింది. 1979లో ఖొమేనీ అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందం ఆగిపోయి, తిరిగి ఇటీవల ఇరాన్, ఒమన్ రెండు దేశాలూ ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించుకున్నాయి. అందువల్ల అంతర్జాతీయ నిభందనల ప్రకారం దాన్ని మూసివేయటానికిగానీ, రవాణాకు టోల్ ఫీజు వసూలు చేయటానికిగానీ ఇరాన్, ఒమన్ దేశాలకు పూర్తి అధికారం ఉంటుంది. కానీ ఇపుడు ఆ జలసంధికి దూరంగా అంతర్జాతీయ జలాలలో యుద్ధనౌకలు భారీగా మొహరించి అమెరికా తన 'బ్లాకేడ్' సృష్టించటమే అంతరాయంగా చట్టవిరుద్ధం. ఇది 'గురివింద సామెత'ను గుర్తు చేయటం లేదూ? గతంలో రెండుసార్లు చర్చలు సాగిస్తూనే తమ దేశంపై బాంబులు కురిపించిన అమెరికా దుర్మార్గం దృష్టిలో ఉంచుకుని మొదట చర్చలకు తటపటాయించినా, శాంతి సాధనకోసం ఇరాన్ కూడా చర్చలకు సిద్ధపడటం, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించటాన్ని ప్రపంచం హర్షించింది. కానీ ఏప్రిల్ 11న, పాకిస్తాన్ మధ్యవర్తిగా ఇస్లామాబాద్‌లో చర్చలు సాగుతుండగానే అమెరికా 'డిస్ట్రాయర్లు' హోర్ముజ్ జలసంధిలో ప్రవేశించటానికి ప్రయత్నించటం ఇరాన్ హెచ్చరికలతో వెనుదిరగటం చేసింది. చర్చలపేరుతో ఇరాన్‌ను ఏమార్చి వాళ్లు అమర్చిన 'సముద్రమైన్ల'ను తొలగించటం కోసం అమెరికా ప్రయత్నించింది.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280